క్లుప్తంగా

ధ్వజస్తంభం తొలగింపునకు పూజలు

కందుకూరు: స్కంధపురి జనార్ధనస్వామి దేవస్థానంలో పురాతన ధ్వజస్తంభాన్ని తొలగించి నూతన ధ్వజస్తంభ ఏర్పాటు చేసేందుకు ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో దాదాపు 200 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం శిధిలావస్థకు చేరి కొంత పక్కకు ఒరిగిపోయింది. దీంతో పాత ధ్వజస్తంభాన్ని తొలగించి నూతన ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయాలని దేవాదాయశాఖ అధికారులు నిర్ణయించారు. దీనిలో భాగంగా ఆదివారం పాతధ్వజస్తంభాన్ని తొలగించేందుకు ముహూర్తం నిర్ణయించి, రెవెన్యూ, పోలీస్, దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభాన్ని క్రేన్ సహాయంతో తొలగించారు. అదే సందర్భంలో నూతన స్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. నూతన ధ్వజస్తంభాన్ని త్వరలోనే తయారు చేయి ధ్వజస్తంభాన్ని ప్రతిష్టామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, ఆలయ ఈఓ బైరాగిచౌదరి, ట్రస్టుబోర్డు చైర్మన్ రావుల కొల్లు బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

పీసీపల్లి: స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12,113,14 తేదీల్లో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేగ ఆంజనేయులు, ఎంఈఓలు శ్రీనివాసులు, సంజీవ్‌లు తెలిపారు. ఈ క్రీడల్లో అండర్ 11,14,17 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు జరుగుతాయన్నారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తమ విద్యార్థులను పోటీల్లో భాగస్వాములను చేయాలన్నారు. విద్యార్థులకు వివరాలను ఆన్లైన్ చేసి ఫారాలు నింపి అందజేయాలన్నారు. 12వ తేదీ కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, 13వ తేదీ వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, యోగా, 14వ తేదీన అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తారన్నారు. వివరాలకు 9490855253 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

డివిజన్‌లో 144 సెక్షన్ అమలు


రత్నాకర రామరాజు, డీఎస్పీ

కనిగిరి రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో కనిగిరి డివిజన్‌లోని అన్ని మండలాల్లో 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు కనిగిరి డీఎస్పీ రత్నాకర రామరాజు తెలిపారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నలుగురు ఒక చోట గుమ్మికూడి ఉండరాదన్నారు. కీలకమైన ప్రాంతాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటుకు అన్ని స్టేషన్లకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

58 మందికి చీరలు పంపిణీ


అనంతవరంలో చీరలు పంపిణీ చేస్తున్న కృష్ణయ్య

టంగుటూరు: టంగుటూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన కసుకుర్తి కృష్ణయ్య హైదరాబాద్‌లో నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందారు. ఆదివారం ఆయన తన స్వగ్రామంలో 58 మంది వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. పే బ్యాక్ టు ద సొసైటీని పాటించడంలో మానసిక సంతృప్తి కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అడుగుజాడలల్లో నడవాలని కోరారు.

న్యాయం గెలిచింది

- అవినీతి సామ్రాట్ చంద్రబాబునాయుడు ఉండాల్సింది కటకటాల్లోనే..
- చట్టానికి చంద్రబాబు అతీతుడేం కాదు
- నిరుద్యోగుల ఉసురు ఊరకేపోదు
- టీడీపీ శ్రేణులు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే సహించేది లేదు
- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు


కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు రూ.371 కోట్లను షెల్ కంపెనీలకు తరలించి కొల్లగొట్టిన టీడీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఉండాల్సింది జైల్లోనే అని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. ఎప్పటికైనా గెలిచేది ధర్మమేనని నిరూపితమైందన్నారు. 'స్కిల్' కుంభకోణంలో ప్రాథమిక ఆధారాలున్నాయని పేర్కొంటూ విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం నారా చంద్రబాబునాయుడుకు 14 రోజుల రిమాండ్ విధించడంపై అశోక్‌బాబు స్పందించారు. టంగుటూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న చంద్రబాబుకు వారితోపాటు వారి తల్లిదండ్రుల ఉసురు తగిలి జైలుకు పోయారన్నారు. తాను నిప్పు అని డప్పు కొట్టుకునే చంద్రబాబు.. రాష్ట్ర ప్రజల సొమ్ము రూ.371 కోట్లు దోపిడీ చేసి ఆధారాలతో సహా అడ్డంగా దొరికారన్నారు. తప్పు చేసి కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద చల్లడం సిగ్గుచేటన్నారు. 14 ఏళ్లపాటు సీఎంగా అధికారం వెలగబెట్టిన చంద్రబాబుపై పదుల సంఖ్యలో కేసులు ఉన్నాయని, వ్యవస్థలను మేనేజ్ చేసి ఆ కేసుల్లో స్టేలు పొందాడని విమర్శించారు. తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవించక తప్పదన్నారు. చంద్రబాబు పరిపాలన, జీవితం మొత్తం కుట్రలు, కుతంత్రాలతోనే సాగిందని ధ్వజమెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు ముఖ్యమంత్రులు కానీ, మాజీ ముఖ్యమంత్రులుగానీ జైలుకు పోయిన దాఖలాలు లేవని, మొట్టమొదటగా జైలుకు వెళ్లిన మాజీ సీఎం చంద్రబాబు చరిత్ర హీనుడిగా మిలిగిపోయాడన్నారు. ఆయన 40 ఏళ్ల అనుభవం ప్రజల సొమ్ము దోచుకునేందుకు ఉపయోగపడిందని ఎద్దేవా చేశారు. అభివృద్ధి ముసుగులో దోపిడీకి పాల్పడిన చంద్రబాబును దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి వెనకేసుకురావడం సిగ్గుచేటన్నారు. జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న పురంధేశ్వరి.. అవినీతి చక్రవర్తి అయిన చంద్రబాబుకు మద్దతు ఇవ్వడం మానుకుంటే మంచిదన్నారు. ప్రశ్నిస్తా.. ప్రశ్నిస్తా అనే దత్తపుత్రుడు ఇప్పటికైనా చంద్రబాబు అవినీతిపై ప్రశ్నలు సంధించాలని సూచించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

కొండపి నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే స్వామి, టీడీపీ నాయకులు గొడవలు సృష్టించినా, రిలే నిరాహార దీక్షలు, ర్యాలీల పేరుతో దాడులకు తెగబడినా చట్టపరమైన చర్యలు తప్పవని వరికూటి అశోక్‌బాబు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, కొండపి ఏఎంసీ డైరెక్టర్లు కొమ్ము సురేంద్ర, టంగుటూరి రామకృష్ణ, నల్లూరి సురేంద్ర, మన్నం వెంకయ్య, మేదరమిట్ల భరత్‌రెడ్డి, శారీమందిర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఔట్ల నిర్మాణం వేగవంతం


జగనన్న లేఔట్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలు

వలేటివారిపాలెం: జగనన్న లే ఔట్ల ఇళ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నాయని హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ శ్రీధర్ తెలిపారు. మండలంలోని అంకభూపాలపుం గ్రామంలో 47 ఇళ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతుందన్నారు. ఇప్పటికే ఒక్కో ఇంటికి రూ.52 వేలు చెల్లించినట్లు తెలిపారు. అలాగే 1300 బస్తాల సిమెంట్, స్టీల్ 6 టన్నులు, 187 టన్నులు ఇసుక లబ్ధిదారులకు అందజేశామని పేర్కొన్నారు. ఈ నెల 11న 468 టన్నులు ఇసుక లబ్ధిదారులకు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఒక ఇంటికి సరాసరి నగదు, స్టీల్, ఇసుక కలిపి 98 వేలు ఒక్కో లబ్ధిదారునికి ముట్టినట్లు ఆయన పేర్కొన్నారు. మిగిలిన నగదును విడతల వారీగా వారి వారి ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

ప్రసాద్‌రెడ్డి మృతికి ఎమ్మెల్యే నివాళి


ప్రసాద్‌రెడ్డి మృతికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, పార్టీ శ్రేణులు

కనిగిరి రూరల్: డాక్టర్ ఎస్ సుబ్బారెడ్డి కుమారుడు సానికొమ్ము ప్రసాద్‌రెడ్డి శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ప్రసాద్‌రెడ్డి భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే, ఎన్జీ రంగా వర్సిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. ప్రసాద్‌రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, ఆదినారాయణరెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు ప్రసాద్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ మహోత్సవం


గోపూజలో పాల్గొన్న ఈఓ, ఆలయ కమిటీ, భక్తులు


మహానివేదనతో ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు, ఈవో, కమిటీ, భక్తులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం మహానివేదన, గోపూజ అర్చకులు మంకాల సత్యనారాయణ వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా గోపూజ నిర్వహించి అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ముందుగా నారాయణస్వామివారి మూలవిగ్రహమూర్తికి అభిషేకం నిర్వహించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జి.రమణారెడ్డి, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ ఆవుదేవర ఉత్సవాలు


శ్రీకృష్ణ ఆవుదేవర కొలుపుల్లో పాల్గొన్న నాయకులు, భక్తులు

పామూరు: మండలంలోని జంగాలపల్లె శ్రీకృష్ణుని మందిరంలో శ్రీకృష్ణ ఆవుదేవర ఉత్సవాలు చెనికల కుటుంబీకుల ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు రాధాకృష్ణుల కల్యాణోత్సవం నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రీకృష్ణ జన్మాష్టమి తరువాత గ్రామంలో శ్రీకృష్ణ ఆవుదేవర ఉత్సవాలు నిర్వహిస్తారు. పూజల్లో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్యలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ చెనికల శ్రీను, మాజీ ఎంపీటీసీ మాలకొండయ్య, ఆలా రామసుబ్బయ్య, మితికాల బాలక్రిష్ణ, మలినేని శ్రీను, పలువురు పాల్గొన్నారు.

సేవా సమాజ నిర్మాణంలో భాగస్వాములుకండి


సభ్యత్వ నమోదు చేయిస్తున్న మానవత సంస్థ సభ్యులు

పామూరు: ఉత్తమ సేవా సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య అన్నారు. పామూరులో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న సభ్యత సమోదు కార్యక్రమంలో సంస్థ సభ్యుత్వం తీసుకున్న వారు మాట్లాడుతూ మానవతా సంస్థ మండలంలో పేదవిద్యార్థులకు, క్షతగాత్రులకు ఆర్థికసాయం చేయడంతోపాటు మృతులకు అంతిమసంస్కార కార్యక్రమాల్లో ఫ్రీజర్‌లు సమకూర్చడం, వాహనం సమకూర్చడం కొనియాడదగినదని, ఇలాంటి కార్యక్రమాలు పేదలకు ఎంతో ఉపకరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పి.తిరుపతిరెడ్డి, వి.వెంకటేశ్వరరెడ్డి, రమణయ్య, గడ్డం నారాయణరెడ్డి, కె.వెంకటకృష్ణారెడ్డి, గట్లా భాస్కర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, గోవిందయ్య, మాలకొండారెడ్డి, బాలక్రిష్ణ, గూని వెంకటరెడ్డి పలువురు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు


ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

కందుకూరు రూరల్: మండలంలోని కొండముడుసుపాలెం సమీపంలో ఎర్రవాగు వద్ద విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. రెండు స్తంభాలు పక్కకు ఒరిగి పడేలా ఉన్నాయి. హై ఓల్టేజీ వైర్లు ఉన్న స్తంభాలు కావడంతో ఎప్పుడు వైర్లు తెగిపడతాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కందుకూరు నుంచి కొండముడుసుపాలెంకు, గుడ్లూరు వైపు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం భారీ వాహనాలు తిరుగుతుంటాయి. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలను సరి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

టంగుటూరు: స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని లైబ్రేరియన్ వర్ధనరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. తలిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాకు వెళ్లేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.


గ్రంథాలయంలో విద్యార్థులను చదివిస్తున్న లైబ్రేరియన్

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

జరుగుమల్లి: మండలంలోని కామేపల్లిలో పోలేరమ్మ దేవస్థానంలో భక్తులు ఆదివారం ప్రతేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పోలేరమ్మను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అభిషేకాల అనంతరం పోలేరమ్మను ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులు కుంకుమ పూజ, గోత్రనామార్చన చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివ శంకర్, దేవస్థానం చైర్మన్ సూరంపల్లి కొండయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శీలం రాము పాదయాత్రకు సంఘీభావం


రాముకు స్వాగంతం పలుకుతున్న బోద రమణారెడ్డి, పార్టీ నాయకులు

మర్రిపూడి: 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ సింగరాయకొండ మండల యువజన విభాగం అధ్యక్షుడు శీలం రాము పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద నుంచి శ్రీశైలం వరకు చేపట్టిన పాదయాత్ర రెండో రోజు ఆదివారం మర్రిపూడి మండలం కూచిపూడి గ్రామానికి చేరుకుంది. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోద రమణారెడ్డితోపాటు మండల నాయకులు ఘన స్వాగతం పలికి సంఘీభావం వ్యక్తం చేశారు. అనంతరం రామును శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మాచేపల్లి హనుమంతరావు, చుక్కా కిరణ్, గొల్లపోతు సురేష్, చెప్పర వెంకన్న, అలహరి శ్రీనివాసులు, ఎ.రమేష్, బాబు, ఉజ్వల, పొన్నరు సురేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు నిజస్వరూపం తెలిసింది


చింతపల్లి హరిబాబు

టంగుటూరు: నిరుద్యోగులకు శిక్షణ పేరుతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు రూ.371 కోట్లు కొల్లగొట్టిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన నిజస్వరూపం ప్రజలకు తెలిసిందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. వైఎస్సార్ సీపీపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై టీడీపీ నేతలు నిందలు వేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు అరెస్టుపై నిరుద్యోగులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో జరిగిన అన్ని కుంభకోణాలపై విచారించే రోజులు ముందున్నాయన్నారు.

సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు అర్బన్: సమగ్ర శిక్ష, కేజీబీవీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ప్రకాశం భవనం వద్ద ఉద్యోగులు వేడుకోలు దీక్ష నిర్వహించారు. దీనిలో ఆర్ట్ క్రాఫ్ట్ పీఈటీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్యాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఉద్యోగుల సమస్యలు తీరుస్తామని ఇచ్చిన మాట మేరకు పరిష్కరించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి పనిభారం తగ్గించాలని విన్నవించారు. వేతనంతో కూడి మెడికల్ సెలవులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నీ సంక్షేమ పథకాలు తమకు వర్తింపచేయాలని, వడ్డీ లేని రుణాలు అందచేయాలని కోరారు. వీటితో పాటు ఉద్యోగులు తెలిపిన అన్నీ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. దీనిలో సంఘం నాయకులు వినయ్, సాయి, శ్రీదేవి, మధు, వీరాంజనేయులు పాల్గొన్నారు

ముస్తాబవుతున్న గణనాథుడు

- చాగల్లు నుంచి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు వినాయక విగ్రహాలు.
- 15 అడుగుల వరకు విగ్రహాల తయారీ


హైవే వెంట అమ్మకాలకు ఉంచిన గణనాథుడి విగ్రహాలు

ఉలవపాడు: వినాయకచవితి పండుగ సందర్భంగా పూజలు అందుకోవడానికి వినాయక విగ్రహాలు సిద్ధమయ్యాయి. మండల పరిధిలోని చాగల్లు జాతీయరహదారి పక్కనే మూడు విగ్రహ తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు వినాయక విగ్రహాల ఎగుమతులు జరుగుతాయి. ఇక్కడ విగ్రహాలు తయారుచేసి రాష్ట్రంలోని ఒంగోలు, నెల్లూరు. కడప, నంధ్యాల తో పాటు హైదరాబాద్, వరంగల్‌కు కూడా లారీలలో ఎగుమతులు చేస్తున్నారు. 2 అడుగుల నుంచి 15 అడుగుల వరకు వివిధ ఆకారాల్లో వినాయక విగ్రహాలు తయారీ జరుగుతుంది. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ తయారు చేసే ఈ విగ్రహాలకు మంచి డిమాండ్ ఉంది. వివిధ ప్రాంతాల్లో ఉండే అమ్మకం దారులు ఇక్కడ ఆర్డర్‌లు ఇచ్చి లారీలలో ఆ విగ్రహాలను ఆయా ప్రాంతాలకు తీసుకుని వెళ్లి అమ్ముతున్నారు. గత రెండు రోజులుగా ఆర్డర్ ఇచ్చిన బయట ప్రాంతాల వారు లారీల్లో విగ్రహాలను తరలిస్తున్నారు. వివిధ ఆకృతుల్లో అందంగా ఈ ఏడాది సరికొత్తగా వినాయక విగ్రహాలు రూపుదిద్దుకున్నాయి. అంతేకాకుండా సిమెంట్, ఫైబర్ విగ్రహాలను కూడా తయారు చేస్తున్నారు. పెయింటర్లు తమ నైపుణ్యంతో విగ్రహాలను అందంగా చేస్తున్నారు. రూ.5 వేల నుంచి రూ.75 వేల వరకు ఈ విగ్రహాలను అమ్మకాలు చేస్తున్నారు. 15 అడుగుల విగ్రహం సుమారు రూ.75 వేల వరకు అమ్ముతున్నారు. ఈనెల 19న వినాయక చవితికి భారీగా విగ్రహాల ఏర్పాటు జరుగుతుంది. చాగల్లు కేంద్రాల వద్ద సుమారు 20 వేల విగ్రహాలు తయారు అవుతున్నాయి.


సరికొత్త ఆకృతిలో వినాయకుడు


బయటి ప్రాంతాలకు తరలుతున్న విగ్రహాలు


గణేశుని విగ్రహాలకు రంగులు అద్దుతున్న కళాకారులు

స్నేహం.. 'అపూర్వ'ం


పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మార్కాపురం టౌన్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 2003–04లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో అపూర్వంగా సాగింది. పూర్వ విద్యార్థుల్లో పలువురు ఉద్యోగులు, వ్యాపారవేత్తలుగా స్థిరపడ్డారు. ఆనాటి జ్ఞాపకాలను, ఉపాధ్యాయులతో గడిపిన రోజులను గుర్తుచేసుకున్నారు. చదవు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు టీచర్లుగా, సాఫ్ట్వేర్, రెవెన్యూ ఉద్యోగులుగా జీవితంలో స్థిరపడటం అభినందనీయమని రిటైర్డు డీవైఈఓ సీహెచ్‌పీ వెంకటరెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు టి.శ్రీనివాసులు, హెచ్‌ఎంలు సుధాకర్, కృష్ణారెడ్డి, మల్లికార్జునరావు, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.